క్లుప్తంగా

కాళేశ్వరంలో పూజలు



కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వరుడిని భూపాలపల్లి నియోజకవర్గ ఎన్నికల వ్యయ పరిశీలకులు (ఐఆర్ఎస్) కౌశిక్‌రాయ్ శనివారం దర్శించుకున్నారు. స్వామివారి గర్భగుడిలో ప్రత్యేక పూజలు చేశారు. శ్రీశుభానందదేవి అమ్మవారి ఆలయంలో పూజలు చేశారు. అక్కడ ఆయనను అర్చకుడు ప్రశాంత్‌శర్మ సన్మానించి తీర్థ ప్రసాదం అందజేశారు. ఆయన వెంట ఆర్ఐ జగన్‌మోహన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నియామకం



కాళేశ్వరం: కాళేశ్వరం గ్రామానికి చెందిన మెంగాని అశోక్‌ను మహదేవపూర్ బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఈ మేరకు శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి, ఏఐసీసీ సెక్రటరి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు ప్రకాశ్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోట రాజబాపు, ఎంపీపీ రాణీబాయ్, ఎంపీటీసీ మమత, వార్డు సభ్యురాలు స్వరూప తదితరులు ఉన్నారు.

ఆర్థిక సాయం



రేగొండ: మండల కేంద్రానికి చెందిన మహమ్మద్ అజ్మీర్ పాషా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో అతడితో కలిసి పదో తరగతి చదువుకున్న స్నేహితులు శనివారం పరామర్శించి రూ.13 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కోటిలింగం, మాదురి ముక్తీశ్వర్, గన్‌రెడ్డి మనోహర్ రెడ్డి ఉన్నారు.

రూ.97వేలు సీజ్



శాయంపేట : వాహనాలు తనిఖీ చేస్తుండగా రూ. 97 వేల నగదు పట్టుబడింది. ఈ సంఘటన మండలంలోని పరకాల హనుమకొండ ప్రధాన రహదారి మాందారిపేట స్టేజీ వద్ద శనివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో శనివారం సాయంత్రం పరకాల రూరల్ సీఐ మల్లేష్, ఎస్సై దేవేందర్ వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో వరంగల్ నుంచి పరకాలకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న సిద్ధంశెట్టి నితిన్ ద్విచక్ర వాహనాన్ని, బ్యాగును తనిఖీ చేయగా అందులో రూ. 97వేల నగదు లభించినట్లు సీఐ తెలిపారు. ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా ఎలాంటి పత్రాలు లేకుండా నగదు తీసుకెళ్తుండగా సీజ్ చేసి పరకాల ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అప్పగించినట్లు పేర్కొన్నారు.

ఏటూరునాగారం వాసికి డాక్టరేట్



ఏటూరునాగారం: ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రానికి చెందిన కాతా కిషోర్ కుమార్ కాకతీయ విశ్వవిద్యాలయంలోని కంప్యూటర్ సైన్స్‌లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తూ కంప్యూటర్ సైన్స్‌లో డాక్టరేట్ పొందారు. ఈనెల 1న హైదరాబాద్‌లో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, వీసీల చేతుల మీదుగా డాక్టరేట్ పట్టాను స్వీకరించారు. అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తూనే డాక్టరేట్ పొందడంపై కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



రేగొండ: మాట్లాడుతున్న ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి



టేకుమట్ల: అవగాహన కల్పిస్తున్న ఎస్సై గట్ల సుధాకర్

రేగొండ: ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై శ్రీకాంత్ రెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం మండలంలోని చెన్నాపూర్, రూపిరెడ్డిపల్లి, దమ్మన్నపేట గ్రామాలలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో ఘర్షణలకు పాల్పడితే కేసుల పాలవుతారని, తద్వారా అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

టేకుమట్ల: ఎన్నికలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్సై గట్ల సుధాకర్ అన్నారు. శనివారం మండలంలోని కుందనపల్లిలో ఓటుహక్కు వినియోగంపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తారని హెచ్చరించారు. ఎన్నికల కోడ్‌లో కేసులు నమోదైతే ప్రతీ సారి ఎన్నికల సమయంలో బైండోవర్ చేయాల్సి ఉంటుంది కావున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుళ్లు సుమన్, మహేందర్, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

విశ్వరూప సభను జయప్రదం చేయండి

● కార్యకర్తల సమావేశంలో మంద కృష్ణ మాదిగ



మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

భూపాలపల్లిరూరల్ : ఎస్సీలను ఏ,బీ,సీ,డీలుగా వర్గీకరించాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించే విశ్వరూప మహాసభకు మాదిగలు, ఉపకులాలు అధికసంఖ్యలో తరలిరావాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. శనివారం భూపాలపల్లి కాకతీయ కాలనీలో జిల్లాస్థాయి మాదిగల విశ్వరూప మహాసభ సన్నాహక సమావేశం బొల్లిబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈసమావేశానికి ముఖ్యఅతిథిగా మంద కృష్ణ మాదిగ మాట్లాడారు. మాదిగలు, 57ఉప కులాలకు న్యాయం జరగాలంటే వర్గీకరణ ఒక్కటే ఏకైక మార్గమని స్పష్టం చేశారు. ఈ క్రమంలో తాము ఏ పార్టీ జెండాలు మోయాల్సిన అవసరం లేదని, ఈ అంశం కేంద్ర ప్రభుత్వంపై ఆధారపడి ఉందన్నారు. ప్రధాని మోదీ, హోంశాఖ మంత్రి అమిత్ షాలు వర్గీకరణ చేస్తామనే మాటను తమ జాతి ఎదుట బహిరంగంగా చెప్పాలనే ఆకాంక్షతో ఉన్నామన్నారు. ఈ నెల 11న నిర్వహించే విశ్వరూప మహాసభకు లక్షలాదీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు భట్టు విజయ్, ఉపాధ్యక్షుడు దోర్నాల రాజేందర్, ఎంజేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మంథెన సమ్మయ్య, జిల్లా అధ్యక్షుడు ఎర్రం సతీష్, నాయకులు సంపత్, చంద్రమౌళి, రవి, తదితరులు పాల్గొన్నారు.

ములుగు : పదేళ్లుగా బీఆర్ఎస్, 20 ఏళ్ల నుంచి కాంగ్రెస్ పార్టీ మాదిగలకు మాయమాటలు చెప్పి మోసం చేస్తూనే ఉన్నాయని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. ములుగు జిల్లా కేంద్రంలో నాయకులతో ఏర్పాటు చేసిన సన్నాహక సభలో ఆయన మాట్లాడారు. మాదిగల వర్గీకరణ చేయకపోతే జాతికి తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు.

కీర్తిరెడ్డిని గెలిపించాలి



భూపాలపల్లి రూరల్: ప్రచారం చేస్తున్న నాయకులు



రేగొండలో..

భూపాలపల్లి రూరల్: నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి చందుపట్ల కీర్తిరెడ్డి గెలిపించాలని ఆ పార్టీ అర్బన్ అధ్యక్షుడు సామల మధుసూదన్ రెడ్డి అన్నారు. శనివారం టిటూ క్వార్టర్స్‌లో ఇంటింటి ప్రచారం చేశారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ జిల్లా అధ్యక్షుడు దొంగల రాజేందర్, నా యకులు తుమ్మేటి రాంరెడ్డి, కోరె సుధాకర్, మంద ల రఘునాథ్‌రెడ్డి, దొంగల కుమార్, మహిళా మో ర్చా అధ్యక్షురాలు వేశాల సత్యవతి పాల్గొన్నారు.

రేగొండ: నియోజకర్గ బీజేపీ అభ్యర్థి చందుపట్ల కీర్తిరెడ్డిని అధిక మెజారిటీతో గెలిపించాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు దాసరి తిరుపతిరెడ్డి అన్నారు. మండలంలోని నారాయణపూరం గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెన్నంపల్లి పాపయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి నిశీధర్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. బీజేపీ అధికారంలోకి వస్తే బీసీలే ముఖ్యమంత్రి అవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు పోలుసాని తిరుపతిరావు, బుచ్చిరెడ్డి, నారాయణ రెడ్డి నాయకులు రాజేందర్‌రెడ్డి, పెండ్యాల రాజు, మల్లేష్, రవి, శంకర్, శివరాజు, శ్రీకాంత్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర అభివృద్ధికి ప్రణాళికలు

● ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి



భూపాలపల్లి అర్బన్: ఓటు అభ్యర్థిస్తున్న గండ్ర వెంకటరమణారెడ్డి

భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి పట్టణ సమగ్ర అభివృద్ధికి ప్రణాళికలను రూపొందించనున్నట్లు ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి తెలిపారు. పట్టణంలోని శాంతినగర్, హన్మాన్‌నగర్‌లలో శనివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భూపాలపల్లి ప్రస్థానం శాంతినగర్, హన్మాన్‌నగర్‌తోనే మొదలైందన్నారు. ప్రతి వార్డును కలియ తిరిగి నీటి సమస్య తీర్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి బస్వారాజు సారయ్య, నాయకులు సెగ్గ వెంకటరాణిసిద్దు, రమేష్, జనార్ధన్, సంపత్, రాజ్‌నాయక్, రమేష్, లక్ష్మి, శారద పాల్గొన్నారు.

భూపాలపల్లి రూరల్: ముఖ్యమంత్రి కేసీఆర్ అడగక ముందే దివ్యాంగులను గుర్తించి అనేక రకాల సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యేపాటు, మాజీ మంత్రి ఎమ్మెల్సీ బస్వారాజు సారయ్య, రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ సంస్థ చైర్మన్ వాసుదేవారెడ్డి హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ.. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా రూ.4016 పెన్షన్ ఇస్తున్నామని తెలిపారు. దివ్యాంగుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నీలంబరం, నాయకులు నర్సింగం, వంగనర్సయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణి సి ద్దూ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బుర్ర రమేష్, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ కళ్లెపు శోభ, స్థానిక నాయకులు పింగిలి రవీందర్‌రెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు

మహదేవపూర్: మహదేవపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ చల్ల తిరుపతిరెడ్డి, అతడి భార్య ఎంపీటీసీ చల్ల రమ ఎమ్మెల్యే, కాంగ్రెస్ మంథని అభ్యర్థి శ్రీధర్‌బాబు సమక్షంలో శనివారం పార్టీలో చేరారు. వారితో పాటు ఇద్దరు డైరెక్టర్లు కలుగూరి సమ్మక్క, పంతంగి సుమన్, బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షులు సమ్మిరెడ్డి, కలుగూరి ఊషయ్య, మంచినీల్ల చంద్రయ్య, గోగుల రాజగోపాల్, మోతె సమ్మయ్య, చేకుర్తి స్వామి, సుమారు 100 మంది బీఆర్ఎస్ నాయకులు చేరగా ఎమ్మెల్యే వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు డాబాడే బాలాజీరావు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎండీ అక్బర్‌ఖాన్ ఆధ్వర్యంలో పార్టీలో చేరగా ఎమ్మెల్యే ఆహ్వానించారు.

కాళేశ్వరం: మండలంలోని మెట్పల్లి పంచాయతీ పరిధిలోని వీరాసాగర్ గ్రామానికి చెందిన యువకులు గుంటి శ్రీనివాస్, పిట్టల రాజు, జైన లచ్చులు, జైన నాగారాజు, గుంటి శ్రీధర్, సేగల విష్ణు, గుండం విష్ణు, జీక మధు, మంగునూరి, పిట్టల గణపతి, జైన రాజు, జైన్ మలేష్‌లు సర్పంచ్ ముల కల శోభ రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ మేరకు మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలకు చర్యలు



పోలింగ్ బూత్‌లను పరిశీలిస్తున్న తహసీల్దార్

ఏటూరునాగారం: మండలంలోని పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపట్టామని తహసీల్దార్ సృజన్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో ఉన్న ఐదు పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. పోలింగ్ కేంద్రానికి వచ్చే ఓటర్లు, సిబ్బందికి కావాల్సిన సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. తాగునీరు, విద్యుత్, బాత్‌రూమ్స్, దివ్యాంగులు, వృద్ధుల కోసం ర్యాంపుల నిర్మాణాలు చేపట్టామన్నారు. ఏదైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద బీఎల్ఓల పేర్లు, వారి సెల్ నంబర్లను నమోదు చేయించామని, ఓటర్ల సమస్యలుంటే వెంటనే ఆయా పరిధిలోని బీఎల్ఓలకు కాల్ చేయాలని సూచించారు. ఆయన వెంట ఆర్ఐ శ్రీనివాస్, జెడ్పీహెచ్ఎస్ జూనియర్ అసిస్టెంట్ రాములు తదితరులు ఉన్నారు.

ఓటు వినియోగంపై కళా ప్రదర్శన



ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

వెంకటాపురం(ఎం): మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో శనివారం తెలంగాణ సాంస్కృతిక సారధి రాగుల శంకర్ బృందం ఓటు వినియోగంపై కళా ప్రదర్శన నిర్వహించారు. ఓటుహక్కు వినియోగంపై ప్రజలకు ఆటపాటలతో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాకారులు గోల్కొండ బుచ్చన్న, ఈర్ల సాగర్, రహీమొద్దీన్, రాజేందర్, విజయ్, తిరుపతి, కుమార్, సురేష్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం



మొగుళ్లపల్లి: మాట్లాడుతున్న గండ్ర జ్యోతి



చిట్యాల: ప్రచారం చేస్తున్న నాయకులు

మొగుళ్లపల్లి: తెలంగాణ రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి అన్నారు. శనివారం మండలంలోని బంగ్లపల్లి, వేములపల్లి, మొగుళ్లపల్లి, కాసులపహడ్, గుండ్లకర్తి గ్రామాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కేసీఆర్ నాయకత్వంలో నిర్ణీత సమయంలో ప్రాజెక్టులను నిర్మించుకుని రైతుల వ్యవసాయ అవసరాలకు సాగునీరు అందించి ఈ రోజు దేశంలో పంటల ఉత్పత్తిలో తెలంగాణ రాష్ట్రం దేశానికే అన్నపూర్ణ రాష్ట్రంగా ఏర్పడిందని అన్నారు. ప్రతి ఒక్కరూ కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షు డు బల్గూరి తిరుపతిరావు, ఎంపీపీ యార సుజాత సంజీవరెడ్డి, జెడ్పీటీసీ జోరుక సదయ్య, చిట్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ కోడారి రమేష్, పీఏసీఎస్ చైర్మన్ నర్సింగరావు పాల్గొన్నారు.

టేకుమట్ల: బీఆర్ఎస్ పార్టీకే ప్రజల మద్దతు ఉందని ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి, జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని బూర్నపల్లి, ద్వారకపేటలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్మిక శాఖ మండల అధ్యక్షుడు రామకృష్ణగౌడ్, ఎంపీటీసీ పెరుమాండ్ల మొగిళి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సట్ల రవి, నిమ్మల స్వామి, నేరేళ్ల చేరాలుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో కరెంట్ కష్టాలు

చిట్యాల: కాంగ్రెస్ వస్తే కరెంట్ కష్టాలు తప్పవని జెడ్పీటీసీ గొర్రె సాగర్ అన్నారు. శనివారం మండలంలోని పాసిగడ్డతండాలో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి గెలిపించాలని ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో కాంగ్రెస్ పాలనలో గ్రామాలలో తాగు నీటి కోసం మహిళలు అనేక కష్టాలు పడ్డారని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తరువాత భగీరథ నీరు రావడంతో ఎలాంటి ఇబ్బందులు లేదన్నారు. వైస్ ఎంపీపీ నిమ్మగడ్డ రాంబాబు, అజ్మీరా రాజు నాయక్, జాలిగపు కిష్టయ్య, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నంబర్ ప్లేట్ లేని వాహనాలు సీజ్



సీజ్ చేసిన వాహనాలను చూపుతున్న పోలీసులు

భూపాలపల్లి అర్బన్: జిల్లా కేంద్రంలో నంబర్ ప్లేట్ లేని ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు సీఐ రాంనర్సింహారెడ్డి తెలిపారు. పట్టణంలో పలు కాలనీలో వాహనాలు తనిఖీ చేస్తుండగా నంబర్ ప్లేట్ లేకుండా నడుపుతున్న 15 ద్విచక్ర వాహనాలు పట్టుబడినట్లు తెలిపారు. చాలామంది పాత నేరస్తులు నంబర్ లేకుండా ఉన్న వాహనాలను వాడి నేరాలు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. సీజ్ చేసిన వాహనాలకు తగిన ఆధారాలు చూపించి జరిమానా చెల్లిస్తే వాహనాలు విడుదల చేస్తామని చెప్పారు. ఈ తనిఖీల్లో ఎస్సై శ్రావణ్‌కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా తయారు చేయొద్దు



పట్టుకున్న గుడుంబాను చూపిస్తున్న పోలీసులు

శాయంపేట : అమాయకుల ప్రాణాలను హరిస్తున్న నాటుసారాను తయారు చేయొద్దని తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ జగన్నాథరావు అన్నారు. మండలంలోని ప్రగతిసింగారం, కాత్రపల్లి గ్రామాల మధ్య ఎక్సైజ్ పోలీసులు శనివారం తనిఖీ చేస్తుండగా ద్విచక్ర వాహనంపై నాటుసారా తరలిస్తున్న వ్యక్తి తారసపడినట్లు తెలిపారు. ఎక్సైజ్ పోలీసులను చూసిన వ్యక్తి వాహనం వదిలి పారిపోయాడని తెలిపారు. ద్విచక్రవాహనంపై ఉన్న సంచిని పరిశీలించగా అందుబాటులో 15 లీటర్ల నాటుసారాను లభించగా సారాను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు వెల్లడించారు. పారిపోయిన వ్యక్తి కాత్రపల్లితండాకు చెందిన వాంకుడోతు భావ సింగ్‌గా గుర్తించి అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎక్సైజ్ ఎస్సై పద్మ, సిబ్బంది లక్ష్మణాచారి, సమ్మయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గ్యారంటీ స్కీంలు పక్కాగా అమలు



కాటారం: ప్రచారం చేస్తున్న శ్రీనుబాబు



మొగుళ్లపల్లిలో..

కాటారం: ప్రజల ఆశీర్వాదంతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మేనిఫెస్టోలో ప్రకటించిన ఆరు గ్యారంటీ స్కీంలను పక్కాగా అమలు చేస్తామని ఆ పార్టీ యూత్ రాష్ట్ర నాయకుడు, దుద్దిళ్ల శ్రీనుబాబు అన్నారు. మండల కేంద్రంలో శనివారం శ్రీనుబాబు కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. గ్యారంటీ స్కీం కార్డులను అందజేసి హామీలను గురించి వివరించారు. ఈ సందర్భంగా శ్రీనుబాబు మాట్లాడుతూ.. సంబండ వర్గాల సంక్షేమం, అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. పేద ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను అమల్లోకి తీసుకొచ్చిన చరిత్ర కాంగ్రెస్ పార్టీది అన్నారు. శ్రీధర్‌బాబుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు ప్రకాశ్‌రెడ్డి, ఎంపీపీ పంతకాని సమ్మయ్య, మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు చీమల సందీప్, సర్పంచ్ అంగజాల అశోక్, నాయకులు కుంభం రమేశ్‌రెడ్డి, గంగిరెడ్డి లచ్చిరెడ్డి, గడవేణ దేవేందర్, పసుల రాజమౌళి, తదితరులు పాల్గొన్నారు.

అధికారంలోకి రాగానే హామీల అమలు

మొగుళ్లపల్లి: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ పథకాలను వెంటనే అమలు చేస్తామని ఆ పార్టీ నాయకులు అన్నారు. శనివారం మండల కేంద్రంలో గండ్ర సత్యనారాయణరావు గెలుపు కోరుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మేనిఫెస్టో కార్డులను ప్రతి ఒక్కరికీ అందిస్తూ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పడిదల ప్రకాష్‌రావు, ఎలేటి శివరెడ్డి, గుండారపు తిరుపతి, నడిగొటి రాము, మోరె జయపాల్‌రెడ్డి, బద్దం మోహన్, రాజేశ్వర్‌రావు, అన్నారెడ్డి, రఫీ ఉన్నారు.

భూపాలపల్లి రూరల్: పట్టణంలోని 19వ వార్డులో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ కురిమిల్ల రజితశ్రీనివాస్ పార్టీ కార్యకర్తలతో కలిసి శనివారం ప్రచారం చేశారు. పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గండ్ర సత్యనారాయణరావును గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షురాలు బలంతుల శ్రీలత, పార్టీ కౌన్సిలర్లు ముంజాల రవీందర్, స్థానిక వార్డు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

చిట్యాల: పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని టీపీయూఎస్ మండల అధ్యక్షుడు కె.రఘుపతి పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజన సమయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం అప్పటి ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని తొలగించి కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని తీసుకవచ్చిందని దీంతో ఉద్యోగ, ఉపాధ్యాయులు చాలా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సీపీఎస్‌ను అంతం చేసి పాత పెన్షన్ విధానాన్ని తీసుకువచ్చే విధంగా రాజకీయ పార్టీలు వారి మేనిఫేస్టోలో చేర్చాలని కోరారు. అలాగే బదిలీలు అయిన స్కూల్ అసిస్టెంట్లను వెంటనే రిలీవ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్, గౌరవ అధ్యక్షులు ఎం.రఘుపతి, బుర్ర సదయ్య, జి.భాస్కర్, ఉపాధ్యక్షులు ఎం.అశోక్, టి.సతీష్, కార్యదర్శి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.